

ఎ.జె.యస్. కేశవరావు

# స్నేహం మైనస్ ప్రాణం

"కృష్ణారావు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకోవడానికి ఎందుకు ప్రయత్నించాడు?" హాస్పటల్ వరండాలో బల్లపై కూర్చున్న శంకరం ఈ ప్రశ్నకు సమాధానం దొరక్క ఆలోచిస్తున్నాడు.

కృష్ణారావంటే తన కెప్పుడూ కోపం గాని, అసహ్యంగాని కలగలేదు. కాని ఇప్పుడు అసహ్యించుకుంటున్నాడు, ఆత్మహత్య చేసుకొనే అసమర్థుడు తన స్నేహితుడైనందుకు.

మానసిక, ఆర్థిక సమస్యలే ఆత్మహత్యకు పురిగొల్పుతాయి. తనకు తెలియని అలాంటి సమస్యలు కృష్ణారావుకేమున్నాయి? ఇద్దరి మధ్య ఏ విషయమూ దాగేది కాదు. అలాంటిది తనకు తెలియని ఆ పెద్ద సమస్య ఏమై ఉంటుంది?

తనమీద కృష్ణారావు ఆర్థికంగానైతేనేమి ఏ విషయంలోనైనా చాలా మెరుగు. తాత, తండ్రులు సంపాదించి ఇచ్చిన ఆస్థి ఉంది. అందమైన భార్య, ముత్యాల్లాంటి ఇద్దరు పిల్లలు. ఇంత

చక్కని జీవితం గడుపుతున్న కృష్ణారావు ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించడమేమిటి? అయినా తన కళ్ళముందు అలా గడుపుతున్న కృష్ణారావుకి తనకు కనిపించని ఏదైనా సమస్య వచ్చిందేమో? సున్నితమైన మనస్సుగల అతను దానికి తట్టుకోలేకపోయాడేమో?

అసలు సమస్యనేది ఉంటే ప్రాణ స్నేహితుడైన తనకు చెప్పొచ్చుగా... అంత చెప్పుకోలేని సమస్యా కృష్ణారావుది? ఒకవేళ ఉన్నా వాటిని సమర్థతతో అధిగమించినవాడే మనిషౌతాడు. అసలు జీవితాన్ని ఆత్మహత్యతో అంతం చేసుకోవడాని ఎందుకు ప్రయత్నిస్తారు? ఈ అపూర్వమైన మానవజన్మ పోతే మళ్ళీ వస్తుందా? ఈ వింత ప్రపంచాన్ని చూడ్డానికి కష్టాలను, సమస్యలను ఎదిరించి ఎందుకు బ్రతకలేరు?

తనంటే కృష్ణారావుకెంత అభిమానం. ఒకరోజు కనిపించకపోతే విలవిల్లాడిపోయేవాడు. అలాంటి స్నేహితుడు తన నుండి, ఈ లోకాన్నుండి దూరమైపోవడానికి ప్రయత్నించినపుడు ఆ సమయానికి తను అక్కడకు వెళ్ళాడు. ఇంట్లో అలజడి లేదు ప్రశాంతంగా ఉంది. ఒకవేళ కృష్ణారావు భార్య పిల్లలతో ఆ ఊళ్ళోనే ఉన్న వాళ్ళ అమ్మగారింటికి వెళ్ళిందనుకొని, లోనికి వెళ్ళి చూసాడు. కృష్ణారావు మంచానికి అడ్డంగా పడి ఉన్నాడు. ప్రక్కన నిద్రమాత్రల సీసా ఉంది. వెంటనే హాస్పిటల్‌కు తీసుకొచ్చాడు. ఇంతవరకు తాను అదృష్టవంతుడే స్నేహం విషయంలో...

"శంకరం" అన్న పిలుపుతో ఆలోచనల నుండి బయటపడి కంగారుగా లేచి నిలబడ్డాడు.

"నీ స్నేహితుడు బ్రతికి బయటపడ్డట్టే. వెళ్ళి చూసుకో" అని ముందుకు వెళ్ళిపోయాడు డాక్టర్.

గబగబా కృష్ణారావున్న గదిలోకి వెళ్ళాడు...దగ్గరగా వెళ్ళి పలకరించబోయాడు.

మాట్లాడటానికి సమయం లేకుండానే శంకరం చెంప ఛెళ్ళుమంది.

కృష్ణారావు మొఖంలో కోపం సలసలా మరుగుతోంది.

శంకరానికి ఈ హఠాత్పరిణామం అర్థంకాక అలాగే నిలువెల్లా నిస్తేజంగా నిలబడిపోయాడు.

'కృష్ణారావు నన్ను కొట్టాడేమిటి?' శంకరం మనసులోని ప్రశ్న పెదవులను ఛేదించలేకపోయింది.

ఆత్మహత్య చేసుకొనేవాణ్ణి బ్రతికించినందుకా? అదే అయితే అడిగేవాడు ఇలా ఎందుకు చేస్తాడు? తమది ప్రాణస్నేహం. ఒకరు కష్టపడితే ఒకరు చూడలేరు. అందుకే అతన్ని వెంటనే హాస్పటల్లో చేర్పించి బ్రతికించుకోగలిగాడు.

కాస్సేపాగి అన్నాడు "కృష్ణా ఏమిటిది?"

"నా కళ్ళముందు నుండి వెళ్ళిపో... వెళ్ళకపోతే చంపేస్తా...!" కృష్ణారావు పిడికిళ్ళు బిగించి అరిచాడు.

శంకరానికి భూమి తల్లకిందులయినంత పనయ్యింది.

ఏవేవో అడుగుదామనుకున్నాడు కాని, మాటలు రానివాడిలా బయటకు వచ్చేసాడు.

* * *

కృష్ణారావు యథావిధిగా ఆఫీసుకొస్తున్నాడు. శంకరం రావటంలేదు. రోజులు గడుస్తున్నాయి. వాళ్ళిద్దరి మధ్య అంత స్నేహం ఉన్నా కృష్ణారావు వాళ్ళ స్నేహాన్ని పూర్తిగా మర్చిపోయాడు.

ఆరోజు ఆఫీసు వర్కు ఎవరికి వాళ్ళు తలవంచుకు చేసుకుపోతున్నారు. ఆఫీసరుగారికి క్యారియర్ తేవడానికి వెళ్ళిన ప్యూను ఆందోళనగా లోనికి వచ్చి సరాసరి కృష్ణారావు దగ్గరకు వెళ్ళాడు.

"కృష్ణగారు! శంకరంబాబు ఉరోసుకు చచ్చిపోయాడు" రొప్పుతూ చెప్పాడు.

ఈ వార్త సెకనుల్లో ఆఫీసంతా వ్యాపించింది.

చాలామంది అక్కడి నుండి బయలుదేరి శంకరం రూము చేరుకున్నారు.

జనాన్ని తోసుకుని గదిలోకి వెళ్ళాడు కృష్ణారావు. గది మధ్యలో పడుకోబెట్టిన చలనంలేని శంకరం మొఖంలో ఏదో అపనింద తాలూకు అవమానం.

శంకరం అంటూ మీదపడి బోరున ఏడ్చాడు కృష్ణారావు.

ఇంతలో ఎవరో టేబిల్ మీద ఉన్నదని చెప్పి ఒక కవరు తెచ్చి కృష్ణారావుకిచ్చారు.

కవరు పైన 'ఈ కవరు ఎవరందుకున్నా నా మిత్రుడు కృష్ణారావుకు అందజేస్తారని ఆశిస్తున్నాను'అని వ్రాసి ఉంది.

కృష్ణారావు కవరుచింపి లోని కాగితం తీసి మడతవిప్పి చదవటం మొదలు పెట్టాడు.

"ప్రియమిత్రుడు కృష్ణారావుకి,

శంకరం వ్రాయునది. నువ్వు నన్ను చూడటానికి రాకపోయినా నా శవాన్నైనా చూడ్డానికి వస్తావనే నమ్మకంతో వ్రాస్తున్నాను.

తల్లి, తండ్రీలేని ఈ ఒంటరివాడికి ఆ ఒంటరితనం లేకుండా చేసావు. నేను ఒక్కరోజు కనిపించకపోతే తపించిపోయేవాడివి. నీ స్నేహంతో నా జీవితానికి కొత్త ఉత్సాహాన్ని అందించావు. అలాంటి స్నేహితుడవైన నీవు నాపై అంత భరించరాని అపనింద మోపావు. ఆ అపనింద నీ కుటుంబానికి అవరోధం కాకపోతే నేనీపని చేసేవాడిని కాను.

తల్లికంటే అమితంగా భావించే నీ భార్యతో నేను కులకడమా! ఆ మాట తలుచుకుంటేనే నా గుండె పిండయిపోయినంత బాధ కలిగేది. నేను అలాంటివాడిని కాదని చెప్పడానికి, ఈ సమస్యను పరిష్కరించడానికి ఎన్నో మార్గాలు వెది

కాను. కాని పరిష్కారం అయ్యేట్టు అనిపించలేదు. నువ్వు ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించినప్పుడు నిన్ను నేను అసహ్యించుకొన్నాను. సమస్యను పరిష్కరించుకోలేని అసమర్థుడననుకున్నాను. ఆ సమస్య నా నుండే వచ్చింది కాబట్టి నేను ఆత్మహత్య చేసుకోవడం కంటే వేరే మార్గం కనిపించలేదు.

నిజమే. నాకు పెళ్ళి కాలేదు. పాతికేళ్ళ యువబ్రహ్మచారిని. అయినా తల్లిలాంటి నీ భార్యతో ఛీ....ఛీ అసహ్యం అనిపించడం లేదూ ఆ మాటలు తలుచుకుంటే. ఎంతో మహోన్నత మనసు కలవాడనుకున్న నీ నోటినుండి ఎంత నీచమైన మాటలు...భరించి బ్రతకడం కన్నా చనిపోయి మన స్నేహాన్ని శాశ్వతం చేసుకోవడం మంచిదనిపించింది.

సెలవు రోజుల్లో ఏమీ తోచక మీ ఇంటికి వచ్చేవాడిని. మీ పిల్లలతో, నీతో కబుర్లు చెప్పడానికి. నేను వచ్చినపుడు ఎక్కువసార్లు నువ్వుండేవాడివి కాదు. మార్కెట్టుకు వెళ్ళేవాడివి. ఆ సమయంలో నీ భార్యా, పిల్లలతో సరదాగా కబుర్లు చెప్పి నవ్వుకునేవాళ్ళం. వాటి నాధారంగా చేసుకొని ఎవరో ఏదో చెబితే ఆ విషయమై ఆలోచించకుండా నువ్వు ఆత్మహత్యా ప్రయత్నం చేయడం. ఆ తర్వాత నీ భార్యను హింసించడం...

ప్రేమకంటే గొప్పది స్నేహం. అలాంటి స్నేహానికి ద్రోహం మూర్ఖుడైనవాడే చేస్తాడు.

నిన్ను హాస్పిటల్ నుండి డిశ్చార్జి చేసిన తెల్లారి నిన్ను చూడాలన్న కోరికతోను, నాపై నీకుండే ద్వేషానికి కారణం అడగటానికి మీ ఇంటికి వచ్చాను. మెట్లెక్కుతుండగా వినిపించాయి. గుండెల్లో గునపాల్తో పొడిచిన మాటలు. ఆ మాటలతో నీ భార్యను హింసిస్తున్నావ్. నేను వెంటనే వెనుతిరిగిపోయాను. అప్పటినుండి ఇప్పటివరకు ఎంతో మథనపడ్డాను. బ్రతికుండి నీ కాపురాన్ని నిలబెట్టలేను. అందుకే నీ కాపురానికి, మన స్నేహానికి వచ్చిన మచ్చను పోగొడుతున్నాను...

శంకరం ఇంకా ఏదేదో రాశాడు. కృష్ణారావు కళ్ళవెంబడి కారిన కన్నీళ్ళు కాగితం మీదపడి అక్షరాలు చెరిగిపోయాయి.

